ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. అంతేకాక రహదారులపైనా రాసులు బారులు తీరాయి. ఎంతో వ్యయప్రయాసల కోర్చి అన్నదాతలు పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తున్నది. దీంతో రైతులు నెలల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఎప్పుడెప్పుడు తమ ధాన్యాన్ని కొనుగోలు చేస్తారోనని వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలు పడుతుండడంతో ధాన్యాన్ని కాపాడుకోలేక అరిగోస పడుతున్నారు. ఇదే అదునుగా ధాన్యాన్ని తక్కువ రేటుకు కొంటూ రైతులను దళారీలు దగా చేస్తున్నారు. ఇక కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు లేక.. సమయానికి లారీలు రాక.. కాంటాలు జరగకపోవడంతో చేతగాని, చేవలేని కాంగ్రెస్ ప్రభుత్వమంటూ అన్నదాతలు మండిపడుతున్నారు.

–తిరుమలాయపాలెం/ వేంసూరు/ పెనుబల్లి/ పర్శాల, మే 7

- కొనుగోలు కేంద్రాల్లో రాసులుగా వరి ధాన్యం
- నెలల తరబడి జాప్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- అకాల వర్షాలతో అన్నదాతల అగచాట్లు
- కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకోలేక అరిగోస
- ఇదే అదునుగా దండుకుంటున్న దళారీ వ్యవస్థ
- చేతగాని, చేవలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు

సరిపడా గన్నీ బ్యాగులు లేవు.. సమయానికి లారీలు రావు..

తిరుమలాయపాలెం: బచ్చోడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాసులు

ధాన్యపు గుట్టలు

బ్యానర్ పెట్టారు.. కొనుగోలు మరిచారు..

దుమ్ముగూడెం ప్రాథమిక సహకార బ్యాంకు ఆధ్వర్యంలో కే.లక్ష్మీపురం, మహదేవపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద బ్యానర్లు పెట్టారు.. కానీ ఇప్పటివరకు ఒక కిలో ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. మండలంలో సుమారు 3వేల ఎకరాల్లో రైతులు వరి పండించారు. తేమ పేరుతో అధికారులు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో చాలామంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు పంటను తెగనమ్ముకుంటున్నారు. సొసైటీ సీఈవో హిమబిందు మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా కమర్షియల్ సీడ్ పండించారని, ధాన్యంలో తేమ శాతం తగ్గకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావడం లేదని తెలిపారు.

పొలాల్లో ఆరబోసి ఉన్న ధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వడ్ల అమ్మకానికి వచ్చిన రైతులు నెలల తరబడి అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తున్నది. ఏజెన్సీలు, మిల్లర్లు పెట్టే ఇబ్బందులు, కొర్రీలకు రైతులు ఎన్నో అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ పొందే ఆశతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లిన రైతులు పలు రకాలుగా దగాకు గురవుతున్నారు. ప్రభుత్వం సన్న రకం వడ్లను క్వింటా రూ.2,350 చొప్పున కొనుగోలు చేయడంతోపాటు రూ.500 బోనస్ చెల్లిస్తున్నది. ఈ నేపథ్యంలో తిరుమలాయపాలెం మండలంలో డీసీసీబీ, ఐకేపీ ఆధ్వర్యంలో 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. బచ్చోడు కేంద్రంలో నెలల తరబడి కాంటాలు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు టోకెన్లు ఇచ్చినప్పటికీ మిల్లర్లకు కేటాయింపులు జరగకపోవడంతో లారీలు రాక కాంటాల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఇదిలాఉంటే.. నాణ్యత లేదని పుట్టి వడ్లకు రైతుల నుంచి రూ.250 ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. క్వింటాకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారు. వడ్లు లారీకి లోడు చేసినందుకు క్వింటాకు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. అనధికారికంగా ఐకేపీ ఏజెన్సీ మహిళలు, కలాసులు కాంటాల పూర్తయిన రైతుల నుంచి అందినంత దండుకుంటున్నారు. గట్టిగా మాట్లాడితే వడ్ల కాంటాల్లో జాప్యం చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్ల దగా, జాప్యం తట్టుకోలేక అన్నదాతలు దళారులకు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. మండలంలోని తిరుమలాయపాలెం, హైదర్‌సాయిపేట, దమ్మాయిగూడెం, మేడిదపల్లి, బీరోలు, సుబ్లేడు, కాకరవాయి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది.

తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాసులు

రోజులు గడుస్తున్నా వడ్లు కొనట్లే..

కొనుగోలు కేంద్రాల్లో చోటులేక ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన వడ్లు పోశాను. వర్షానికి తడుస్తున్నాయి. వడ్లపై కప్పుకోవడానికి పట్టాలు, బస్తాలు ఇచ్చిన వారు లేరు. 20 రోజులవుతున్నా కాంటాలు కాలేదు. కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నాం. బోనస్ ఏమోగాని మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదు.

–దూదిమెట్ల లక్ష్మణ్, రైతు, బచ్చోడు, తిరుమలాయపాలెం

20 రోజులుగా కల్లాల్లోనే..

వేంసూరు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన రైతుల ధాన్యం 20రోజులుగా కల్లాలోనే ఉంది. ఐకేపీ, పల్లెవాడ సొసైటీ పరిధిలో సుమారు 2500 బస్తాల ధాన్యం ఉన్నా నేటివరకు ఒక్క బస్తా కూడా కాంటా వేయలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ, సొసైటీ కొనుగోలు కేంద్రాల చుట్టూ రైతులు రోజూ ప్రదక్షిణ చేస్తున్నా ఇదిగోఅదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. గన్నీ సంచులు లేవని, లారీలు రావడం లేదని, మిల్లర్లు 1638 రకం మాకొద్దంటున్నారని సాకులు చెబుతున్నారే తప్ప పంటను కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షం వస్తే ధాన్యాన్ని కాపాడేందుకు నానా అగచాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంటి మీద కునుకు లేకుండా ఎదురు చూస్తున్నామని కన్నీటిపర్యంతమవుతున్నారు.

కల్లాల్లో ధాన్యం ఆరబోసి ఉంచిన రైతులు

ధాన్యాన్ని తగలబెట్టేందుకు రైతులు సిద్ధం

కల్లూరు మండలం పుల్లయ్యబంజర ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తగలబెట్టేందుకు రైతులు సిద్ధమయ్యారు. కొనుగోలు చేయకుండా నెలరోజులుగా అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం వచ్చిన వాటిని సైతం కాంటాలు వేసేందుకు గన్నీ బ్యాగులు లేవని, కాంటా వేసినా ట్రక్‌షీట్ రాయడం లేదని, తరుగు ఎక్కువ తీస్తున్నారని మండిపడ్డారు. ఆర్డీవో రాజేందర్‌గౌడ్, సివిల్ సప్లై డీఎం శిరీష, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ భాగం నీరజ, ఎస్సై హరిత మంగళవారం ఆ కొనుగోలు కేంద్రానికి వెళ్లి రైతులతో మాట్లాడి సర్దిచెప్పారు.

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కష్టాలు పడలేకపోతున్నాం..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కష్టాలు పడలేకపోతున్నాం. వాననక ఎండనక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొనుగోలు దారులు అనేక షరతులు పెడుతున్నారు. రోజులు గడుస్తున్నా వడ్లు కాంటాలు వేయడంలేదు. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. లారీలు రావడంలేదు. దీంతో కాంటాలు కాక రైతులు పడిగాపులు కాస్తున్నారు. నేను రెండు పుట్ల వడ్లు తెచ్చాను. నెల రోజులైంది. ఇంకా కాంటాలు కాలేదు.

–నందిపాటి రామకృష్ణ, రైతు, బచ్చోడు

రైతులకు న్యాయం చేయాలి

నేను రెండు ఎకరాల వడ్లు కేంద్రానికి తెచ్చాను. 20 రోజులైంది. ఇంత వరకు కొనుగోలు జరగలేదు, కాంటాలు కాలేదు. బస్తాలు లేవు, పట్టాలు లేవు, రెండుమార్లు వర్షానికి వడ్లు తడిచాయి. వడ్లు కొనేవారు అనేక షరతులతో ఇబ్బందులు పెడుతున్నారు. ఏమి చేయాలో తోచడం లేదు. జిల్లా మంత్రులు పొంగులేటి, తుమ్మల, భట్టి చొరవ తీసుకొని రైతులకు ఇబ్బందులు లేకుండా వడ్లు కొనేలా చేయాలి.

–భూక్యా బాలు, రైతు, బచ్చోడుతండా, తిరుమలాయపాలెం

తీవ్రంగా నష్టపోతున్నాం..

ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులం తీవ్రంగా నష్టపోతున్నాం. వ్యవసాయశాఖ అధికారులు సూచించిన విధంగానే 1938 సన్న రకం ధాన్యాన్ని పండించాం.. రాజుగూడెంలో సుమారు 3వేల టక్కీల ధాన్యం కంటాలకు సిద్ధంగా ఉంది. 20 రోజులుగా కాంటాలు వేస్తారని ఎదురుచూస్తున్నాం. ఏ ఒక్కరు కూడా మా మొర ఆలకించడం లేదు.

–తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, రైతు, రాజుగూడెం, వేంసూరు

పంట కోసి 20 రోజులు..

మా పంట కోసి దాదాపు 20రోజులు అవుతుంది. అప్పటినుంచి నేను, మా కుటుంబ సభ్యులు ధాన్యం విక్రయించేందుకు కల్లాల్లోనే కుప్పలు పోసి ఎదురుచూస్తున్నాం. ప్రతిరోజు ధాన్యాన్ని ఆరబెట్టడం, పట్టాలు కప్పడం చేస్తున్నాం. గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. వానొస్తే మేము పడ్డ కష్టం మొత్తం నేలపాలవుతుంది. 1638 రకం ధాన్యాన్ని పండించాను.

–రాయల సత్యనారాయణ, రైతు, రాజుగూడెం, వేంసూరు

అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు..

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో గతంలో ఎప్పుడూ ఇలాంటి ఇబ్బందులు రైతులం పడలేదు. కేవలం ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లనే గోస పడుతున్నాం. గోనె సంచులు వారికి ఇష్టంవచ్చిన వారికి ఇస్తున్నారు. కాంటా వేసిన వారికి ట్రక్‌షీట్ రాయడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు రాజకీయం చేస్తున్నారు.

–కిష్టంశెట్టి నరసింహారావు, రైతు, కల్లూరు

రైతులకు ఇబ్బంది కలుగనివ్వం..

పుల్లయ్యబంజర కేంద్రంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. రైతుల ధాన్యాన్ని వీలైనంత త్వరగా తరలిస్తాం. రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకొని కేంద్రం నిర్వహణపై కలెక్టర్‌కు వివరిస్తాం. ఏదేనా సమస్య ఉంటే రైతులు నేరుగా నా దృష్టికి తీసుకురావాలి. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు ఇబ్బంది కలిగించం.

–రాజేందర్‌గౌడ్, ఆర్డీవో, కల్లూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఉగ్రవాదంలేని సమాజమే బీఆర్ఎస్ లక్ష్యం

- భారత ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా
- రేపు మిట్టపల్లి గ్రామానికి కేటీఆర్ రాక: సండ్ర

ఖమ్మం, మే 7: ఉగ్రవాదం లేని సమాజం ఉండాలనేది బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని, పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం, ఇండియన్ ఆర్మీ సరైన రీతిలో బుద్ధి చెప్పడాన్ని హర్షిస్తున్నామని, దేశ సమగ్రత, సామరస్యాన్ని, దేశ పౌరులను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని ఆ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. బుధవారం ఖమ్మంలోని తెలంగాణభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, చంద్రావతితో కలిసి మాట్లాడారు. కొన్ని దశాబ్దాలుగా మన దాయాది దేశం పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని పోషిస్తూ భారత్, అఫ్గానిస్థాన్, రష్యాలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఉగ్రవాదుల తయారీ దేశంగా పాకిస్థాన్ ఉంటుందన్నారు. బంగ్లాదేశ్ దేశంగా ఏర్పడిన నాటినుంచి పాకిస్థాన్ భారతదేశ ఆస్తులను నష్టం చేకూర్చే ప్రయత్నం చేస్తుందన్నారు. తమ స్వలాభం కోసం కొన్ని దేశాలు పాకిస్థాన్‌కు మద్దతు తెలుపుతున్నాయన్నారు. దేశప్రజలు ముక్తకంఠంతో ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో పెకలించాలని కోరారు. ఉగ్రవాదం పెంచి పోషించే దేశాలను, ఉగ్రవాదాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. భారత ఆర్మీకి బీఆర్ఎస్ సెల్యూట్ చేస్తుందని, ఇది మనం గర్వపడే సమయం, ఇందులో మనం కచ్చితంగా విజయం సాధిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ ఉదయం 10గంటలకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణ చేసేందుకు తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని తెలిపారు. అంజనాపురంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగి ర్యాలీగా మిట్టపల్లికి చేరుకుంటారని, అక్కడ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొంటారని అన్నారు. పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్, పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు, భాషబోయిన వీరన్న, మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జిల్లా నాయకులు ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, బొమ్మెర రామ్మూర్తి, లకావత్ గిరిబాబు, తాజుద్దీన్, పొట్ల శీను, ఉద్యమకారులు పగడాల నరేందర్, సతీష్, నాయకులు బంక మల్లన్న, యలమద్ది రవి, బలుసు మురళీ కృష్ణ, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

నేలకొండపల్లి మండల కేంద్రంలో సీపీఎం నాయకుల ప్రదర్శన

నేలకొండపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కూసుమంచి (నేలకొండపల్లి), మే 7: గ్రామాల్లో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నేలకొండపల్లిలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రావెళ్ల సత్యనారాయణ భవన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో పార్టీ జిల్లా నాయకురాలు బుగ్గవీటి సరళ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఇండ్ల నిర్మాణం ఉండాలని, మంత్రి పొంగులేటి ఈ ప్రాంతంలో ఇండ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 20న జాతీయ కార్మిక సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. నేతలు పగిడికత్తుల నాగేశ్వరరావు, బషీరుద్దీన్, గుడవర్తి నాగేశ్వరరావు, రామిరెడ్డి, ఎటుకూరి రామారావు, రచ్చా నర్సింహారావు, బెల్లం లక్ష్మి, భూక్యా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ర్యాలీ

మణుగూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ప్రదర్శన

మణుగూరులో జాతీయ జెండాలతో ప్రదర్శన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణుగూరు టౌన్, మే 7: పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ ఆర్మీ చేసిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు మణుగూరులో బుధవారం రాత్రి జాతీయ జెండాలు చేబూని ర్యాలీ నిర్వహించారు. 'జయహో భారత్..' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు, మళ్లీ అక్కడి నుంచి పార్టీ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, నూకారపు రమేశ్, ఆవుల నరసింహారావు, ఎడవెల్లి వెంకటయ్య, ముద్దంగుల కృష్ణ, ప్రభుదాస్, జావీద్ పాషా, ఎండీ హబీబ్, రాంకోటి, వేల్పుల సురేశ్, ఇజ్రాయిల్, వడ్లూరి రాంబాబు, బూర్గుల సతీశ్, బడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కర్రెగుట్టలో నెత్తుటేర్లు

- ఎన్‌కౌంటర్‌లో 26 మంది మావోయిస్టులు మృతి
- మృతుల్లో పార్టీ అగ్ర నాయకుడు?
- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో ఘటన
- మావోయిస్టులు శాంతి లేఖలు పంపినా ఆగని 'కగార్'



కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 7: మావోయిస్టులు శాంతిని కోరుతూ లేఖలు విడుదల చేస్తున్నా అడవుల్లో ఆపరేషన్ 'కగార్' దండయాత్ర మాత్రం ఆగడం లేదు. వారి లేఖలను ఏమాత్రం పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ముందుగా సాగుతున్నాయి. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు బీజాపూర్ జిల్లా కర్రెగుట్టలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య బుధవారం జరిగిన భీకర పోరులో 26 మంది మావోయిస్టులు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రాష్ట్రాల సరిహద్దు బీజాపూర్ జిల్లా కర్రెగుట్టల్లో జరుగుతున్న ఆపరేషన్ 'కగార్'లో భాగంగా 15 రోజులకు పైగా మావోయిస్టుల కోసం భద్రతా దళాలు వేట కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు బస్తర్ రేంజ్ అధికారులు 26 మంది మావోయిస్టులు మృతి చెందారని, వారిలో మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారని పేర్కొంటున్నారు. మృతుల్లో ఓ అగ్ర నాయకుడు సైతం ఉన్నట్లు సమాచారం. వంద సంఖ్యలో జిల్లా రిజర్వ్ గార్డ్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు డ్రోన్ కెమెరాల ఆధారంగా మావోయిస్టులు ఉన్న ప్రాంతాన్ని చిత్రీకరించి, వారి జాడను గుర్తించిన తర్వాత ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ముప్పేట దాడి చేసినట్లు తెలుస్తోంది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో పలువురు మావోయిస్టులు మృత దేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు, మందుగుండు, సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పరుచుకున్న ఆయుధ తయారీ కర్మాగారాలు, బంకర్లను జవాన్లు సీజ్ చేశారు. మృతుల వివారాలను తెలుసుకునేందుకు పోలీస్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలోనే వారి పేర్లతోపాటు క్యాడర్‌ను వెల్లడిస్తామని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

పెద్దాసుపత్రిలో కలెక్టర్ తనిఖీ

ఖమ్మం సిటీ, మే 7: జిల్లాకు ఐదుగురు మంత్రులు రానున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం జిల్లా ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, పలువురు వైద్యాధికారులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం గవర్నమెంట్ మెడికల్ కళాశాల నూతన భవనాల శంకుస్థాపన కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు గురువారం ఖమ్మానికి రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. దవాఖాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. శంకుస్థాపన అనంతరం ప్రభుత్వాసుపత్రిని సందర్శిస్తారని, తర్వాత కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అన్ని శాఖల ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, సంబంధిత వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, వైద్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- రేకుల ఇంట్లోనే వృద్ధ దంపతుల జీవనం
- రేషన్ బియ్యం, పింఛన్ డబ్బులే ఆధారం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దైన్యం
- ఇందిరమ్మ ఇల్లు ఇవ్వని రేవంత్ ప్రభుత్వం

ఏడుపదుల వయసులో ఇందిరమ్మ ఇంటి కోసం ఓ దివ్యాంగ వృద్ధ దంపతులు పెద్ద పోరాటమే చేస్తున్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ జలగంనగర్ కాలనీకి చెందిన ఉప్పతల చిన్నా, వీరమ్మ దంపతులు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. 'చిన్నపాటి రేకుల ఇంట్లో ఉంటున్నాం.. కనికరించి ఇల్లు మంజూరు చేయండి సారూ..' అంటూ వేడుకుంటున్నారు.

ఏడుపదుల వయసులో గూడు కోసం పోరాటం

జలగంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న వృద్ధ దంపతులు ఉప్పతల చిన్నా-వీరమ్మకు నలుగురు కుమారులు, కుమార్తె. అందరికీ వివాహాలయ్యాయి. బతుకుదెరువు రీత్యా ఒక కుమారుడి కుటుంబం ఖమ్మంలో, మరో కుమారుడి కుటుంబం వేరే ప్రాంతంలో ఉంటున్నారు. కొన్నేళ్ల క్రితం మరో ఇద్దరు కొడుకులు, కోడళ్లు మృతిచెందారు. అల్లుడూ మృతిచెందడంతో కూతురు కూడా వృద్ధ దంపతులతోనే ఉంటోంది. తల్లిదండ్రుల రేకుల షెడ్డు పక్కనే ఆమె మరో రేకుల ఇంట్లో జీవనం వెల్లదీస్తున్నది.

రేషన్ బియ్యం, పింఛనే ఆధారం..

చిన్నా – వీరమ్మలకు వివిధ వ్యాధులు రావడంతో ఇప్పటికే నాలుగు రకాల ఆపరేషన్లు జరిగాయి. ఐదేండ్ల క్రితం కొవిడ్ సమయంలో నరాల సమస్య కారణంగా చిన్నాకు రెండ్లు కళ్లు పోయాయి. ఈ వృద్ధ దంపతులకు కరుణగిరి పూర్వ బిషప్ దాత్రత్వంతో నెలనెలా మందులు పంపిణీ చేస్తున్నారు. దివ్యాంగుల పింఛన్ రూ.4 వేలు, 12 కిలోల రేషన్ బియ్యమే వారికి ఆదెరువు. ఎంపీడీవో కార్యాలయం గోడ వెనుకనే వీరి నివాసం. ఈ వృద్ధాప్యంలో ఆ చిన్నాపాటి రేకుల ఇంట్లో ఉంటూ ఎండ, వాన, చల్లి తీవ్రతలను తాళలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అయితే, ఇటీవలి మున్నేటి వరదల్లో వీరు సర్వస్వం కోల్పోయారు. కానీ ఇటీవల వచ్చిన ఇందిరమ్మ మొదటి విడత జాబితాలో కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయలేదు.

–ఖమ్మం రూరల్, మే 7

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో మొర పెట్టుకొని ఒకరికొకరు ఆసరాగా ఆఫీసు మెట్లు దిగుతున్న వృద్ధ దంపతులు (ఫైల్)